# దొంగ




## సుస్మితా రమణమూర్తి

ప్రతి మనిషి జీవితాన్ని తరచి చూస్తే ఎన్నెన్నో గాథలు వెలికి వస్తుంటాయ్ కొన్ని వస్తూనే వెలుగు నిస్తాయ్ మరికొన్ని ఎంతో బాధకి గురిచేస్తాయ్

సుమారు పది సంవత్సరాల నాటి సంఘటన దాన్ని నేనెప్పుడూ మరచిపో(లే)ను ఆ సంఘటన గుర్తుకి వచ్చినప్పుడల్లా నాలో ఏదో తెలియని ఆవేదన — అసంతృప్తి తలెత్తుతుంటాయ్ మనసు బాధతో మెలికలు తిరిగిపోతుంటుంది

ఒకరోజు —

ఆ రోజు ఆదివారం, స్నేహితులు బలవంతం చేస్తే 'మార్నింగ్ షో' సినిమాకి వెళ్ళాను సినిమానుంచి ఇంటికొచ్చేసరికి వాతావరణం అనుకోని ఎథంగా మారింది నిలబడవున్న అమ్మ, నాన్నల ముఖాల్లో కనుబొమల్లో కోప చిహ్నాలు వికటాట్టహాసం చేస్తుంటే — మాటా పలుకూలేని ఆ వాతావరణం నిశ్శబ్దాన్ని మాత్రం నింపుకుని వుంది కారణం అనూహ్యంగా మిగిలిపోయినా, నా మనస్సు అపశ్రుతిని వినిపిస్తూ నన్ను భయపెట్టసాగింది ఆ వాతావరణం ఇంకొంతసేపు అలాగే ఉంటే ప్రపంచమే బ్రద్దలైపోతుందన్నంత భయం నన్నావరించగా మెల్లిగా అన్నాను— "అమ్మా! ఆకలేస్తుంది అన్నం పెట్టవే!" అని అమ్మ,నాన్న ఒకేసారి నావేపు కోపంగా చూశారు

వాళ్ళని నేనెపుడూ అంత కోపంగా వుండటం చూళ్ళేదు అదే మొదటిసారి కిక్కురు మనకుండా మూలనున్న కుర్చీలో అప్రయత్నంగా కూర్చుండిపోయాను

"ఏరా,రామూ! ఎక్కడికిరా వెళ్ళావ్?"— నాన్నగారి గొంతు ఖంగుమంది చెప్పాను తడబడుతూ

"డబ్బులెక్కడివి?" — మరో ప్రశ్న దూసుకొచ్చింది

అమ్మవేపు చూశాను—సమాధానంగా

అంతవరకు ఏదో పుస్తకం చూస్తున్న ప్రక్కింటి సుందరమ్మ అంటే నా అత్యంత ఆప్తమిత్రులు జగం, సురేంద్రల తల్లి అంది

"అడిగేదేదో సూటిగా అడక్క ఆ డొంక తిరుగుడేవిటండి?" అని

"మీకెందుకో మధ్య?" పుక్రోషంగా అన్నాను

"ఏం బాబూ! ఎందుకంత పౌరుషం? మావారి వాచీని తీసినపుడు ఈ పౌరుషం ఏమైందో??" అందామె మూతిని మూడొంకర్లు తిప్పుతూ

ఆ మాటలకి నాకు 'ఎలక్ట్రిక్‌షాక్' తగిలినట్లయింది

నా మెదడు మొద్దుబారిపోయింది

ఆ అర్థంలేని అపవాదు — నా కర్ణమయే సరికి— నాకేం చెప్పాలో తోచలేదు అసలెందుకా వస్తువు పోయింది? పోయినా — ముందు వెనుకా ఆలోచించకుండా నా మీద నేరం ఆరోపించడమేవిటి? నన్ను గురించి అసలు వీళ్ళేవిటను కుంటున్నారు? . . ఇలాంటి కొన్ని వందల ప్రశ్నలు నాలో చెలరేగుతుంటే . .

ఏం చెప్పాలో తెలియక, ఇలాంటి పరిస్థితెందుకు ఏర్పడిందో అర్థంకాక — అయోమయంగా మాత్రం నిల్చుండి పోయాను.

ఆ మాటల తలంపు ఒక అవమానం,నా, అసహాయతగా అన్పించి కళ్లల్లో నీళ్ళుబికాయ్

"ఏరా, అలా దిక్కులు చూస్తావేం? వాళ్ళ వాచీని తీశావా లేదా?" నాన్నగారి గొంతు కంచులా మ్రోగింది

"లేదు, నాన్నా! లేదు వాళ్ళ వాచీని నే తీయలేదు" వస్తున్న దుఃఖాన్ని ఆపుకోడానికి విశ్వప్రయత్నంచేస్తూ అన్నాను

నా పరిస్థితుల్లో ఉన్న మరెవరైనా అనగలిగే మాటే అన్నను

నిజంగా 'దోషి' ఆ పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడు ఇచ్చే సమాధానమే ఇచ్చాను అయినా నన్నెవరూ నమ్మలేదు

'వెధవకి ఇంతప్పట్నుంచే దొంగబుద్ధులు! పెద్దయితే వీడ్ని పట్టుకోగలమా? పోలీసుల కప్పగిస్తేగాని వీడిరోగం కుదరదు" అని బుగ్గలు నొక్కుకుంది సుందరమ్మ

"నేను దొంగనికాను నాకే పాపం

తెలియదు నన్ను నమ్మండి నిజంగా నాకేమీ తెలియదు" అంటూ బావురుమన్నాను

సుందరమ్మ నా మాటలకి ఛీత్కారం చేసింది

ములుకుల్లాంటి ఆవిడ మాటల్ని భరించలేక మానాన్నగారు — "వెధవా ! ఇల్లూ, వాకిలీ లేనట్లు వీళ్లింట్లోను, వాళ్లింట్లోను చదువుకోడం దేనికి ? ఆ ఏడ్చేదో మనింట్లోనే ఏడ్వకూడదూ ?" అంటూ చితకబాదేరు నన్ను

నేను వెక్కివెక్కి ఏడుస్తుంటే మాఅమ్మ బాధపడుతూ, "సుందరమ్మగారూ! మీరేమీ అనుకోనంటే నాదొక్కమాట ! మావాడు మీవారి వాచీని తీయడం మీయింట్లో ఎవరైనా చూచారా ?" అంది

"వేరే చూడాలటమ్మా ! నిన్నటిరాత్రి మా జగం, సురేంద్ర, మీవాడు ఒకేదగ్గర పడుకున్నారు వీళ్ల ప్రక్కనున్న బల్లమీదే మా వారు తన వాచీని వుంచారట ఇంకెవరు తీస్తారు ?– మీవాడుతప్ప ! "

"మీ డ్రైవరు గాని . పనివాళ్లు గాని "

"వాళ్లెవరూ రాకముందే మావారు అడిగారు ఎన్ను ఐనా మా పనివాళ్లుగాని– డ్రైవరుగాని ఏరనుకుంటున్నంత నీచమ్మైన వాళ్లు కారు "

నకు కళ్లనీళ్ల పర్యంతమ్మైంది

"పిక్‌నిక్‌కి వెళ్లిన మీజగంగాని సురేంద్రగాని "

"ఛ! ఛ! ఇలాంటి బుద్ధులు మాఇంటా వంటా లేవు మా వస్తువుల్ని మేమే దొంగిలించుకోవాల్సిన లగత్యమేమీ మాకు పట్టలేదు "

జగం, సురేంద్రల ప్రసక్తి వచ్చేసరికి ఆరోజుకి ముందురాత్రి జగం – సురేంద్రతో అన్నమాటలు ఒక్కసారిగా గుర్తుకొచ్చాయ్

"ఒరే, జగం! నాన్నగారు నిద్ర పోయార్రా ! రేపు తెల్లవార్జామునే మనం పిక్‌నిక్‌కి వెళ్తున్నాంగదా ! నాన్నగారిని వాచీని అడగటమే మరిచిపోయ్యాం" తన చేతికి పెట్టుకున్న వాచీకేసి ఎంతో సంతృప్తిగా చూసుకుంటూ అన్నాడు సురేంద్ర

"ఈ మాత్రం దానికే ఇంత ఇదైపోవడం దేనికి? వాచీని తీసుకెళ్తున్నట్లు అమ్మకి చెబితే సరి" అని జగం అనేసరికి సురేంద్ర ఊరట చెందాడు నన్నుకూడా పిక్‌నిక్‌కి రమ్మన్నారు కాని యోగాశ్రమాన్ని నే నప్పటికే రెండుసార్లు చూసి వుండటంవలన నేను రానని చెప్పేశాను ఐతే వాళ్లుఇంట్లో ఎవరికీ చెప్పకుండానే వాచీ తీసుకెళ్లి పోయారన్న మాట !

సుందరమ్మగారు రుసరుసలాడుతూ నా జేబుల్ని తడిమిచూసి, "దొంగవెధవ ! అప్పుడే ఎక్కడ మార్చేశాడో ?" అనేసరికి నాఆలోచనలు చెదిరిపోయాయ్

ఆమె నన్నలా తనిఖీ చేయడంతో నాగుండె నెవరో నులిమినట్లు ఫీలయ్యాను,

నాకు తెల్సిన విషయాన్ని సుందరమ్మ గారితో చెబితే? ఉఁహూఁ! నమ్మదు పైగా కట్టుకథలల్లుతున్నానని మరింత ఎగిరి పడుతుంది "ఒహవేళ మీ జగంగాని... సురేంద్రగాని " అన్న అమ్మసందేహానికే ఆవిడమండిపడిందే ! ఇహ నా మాట నమ్ముతుందా ? అందులోను జగం, సురేంద్రలు తీశారంటే నమ్ముతుందా ?–అసలు నమ్మదు పైగా మరింత చిందులు త్రొక్కుతుంది జరిగిన విషయం ఆవిడకు జగం, సురేంద్రల ద్వారానే తెలియ జేయాలి అప్పుడుగాని ఆవిడ నన్ను నమ్మదు హుఁ! వాళ్లొచ్చేంతవరకు ఆవిడ దృష్టిలో నేను దొంగని ! నా అంతరాత్మ ముందు నిర్దోషిని !!

ఆమె ఆశించినట్లుగా వాచీ నా జేబుల్లో కన్పించక పోయేసరికి సుందరమ్మగారు పేట్రేగిపోయారు కోపంతో

చేసేదిలేక అమ్మకూడా నా చెంపల్ని చెళ్ళుమన్పించింది

వెక్కి వెక్కి ఏడ్వడం తప్ప మరేమీ చేయలేకపోయాను

విషయం ఇంతవరకు వచ్చింతర్వాత కూడా ఆవిడ నమ్మకం ఎవడిక్కావాలి? జరిగిన విషయం ఆమె నమ్మినా నమ్మకపోయినా చెప్పేయాలి– అని అనుకుంటున్నంతలో, "ఇక్కడున్నావుఁటే? నా కాకలేస్తుంది. వేగంగా రావే, అమ్మా !" అంటూ జగం వచ్చాడు

జగంని చూడగానే నా శరీరం దూదిపింజలా తేలిపోయింది అంతవరకు అనుభవించిన చిత్రవధ, నరకం ఒక్కసారిగా నన్ను విడిపోయాయ్

"ఏమిట్రా ! అప్పుడే వచ్చేశారా ? సాయంత్రం దాకా రారేమో ననుకున్నా!" ఆప్యాయంగా కొడుకు తల నిమురుతూ అంది సుందరమ్మ

"యోగాశ్రమంకే కదమ్మా, వెళ్లింది! అందుకనే వేగంగా వచ్చేశాం !" అన్నాడు జగం

అంతవరకు సుందరమ్మగారి మీద నాలో పేరుకున్న కోపం, అసహ్యం ఒక్కసారిగా విజృంభించాయ్

"ఏవండీ ! సుందరమ్మగారూ ! పిలిపించారా పోలీసుల్ని ?" అన్నాను హేళనగా–జగం వున్నాడు కదాన్నధీమాతో.

ఆమె ముఖం కోపంతో ముటముటలాడిస్తూ అంది: "చేసిననిర్వాకంకి సిగ్గు లేకపోతేసరి వాచీని మటుమాయం చేయడమే కాకుండా పోలీసుల్ని పిలవాలట! పోలీసుల్ని !!" ఆమె మాటల్ని ఖాతర్చెయ్యకుండా జరిగిన విషయాన్ని చెప్పమన్నట్లుగా జగం ముఖంలోకి ముఖంపెట్టి చూశాను నే నాశించినట్లుగా జగం జరిగింది చెప్పలేదు నా ముఖమ్మైనా చూడలేదు పైగా అమ్మా ! నా కాకలేస్తుంది వేగంగా రావే !" అంటూ వెళ్లిపోయాడు

జగం అలా వెళ్లిపోయినందుకు ఆశ్చర్యం, కోపం, ఆవేదన ఒక్కసారిగా నాలో చోటు చేసుకున్నాయ్

ఆశ్చర్యంలోంచి తేరుకునేంతలో సురేంద్ర వచ్చాడు.

తనేమ్మైనా చెబుతాడేమోనని కొన్ని క్షణాలెదుర్చూశాను ఫలితం లేకపోయింది

దాంతో నా మనసు కకావికలమ్మైపోయింది

సురేంద్రవేపు కసిగా, కోపంగా చూస్తూ సుందరమ్మగారితో అన్నాను– "సిగ్గుపడాల్సింది మీరుగాని నేనుకాదు. పిలవండి పోలీసుల్నే పిలుస్తారో!... మరెవర్ని పిలిపిస్తారో!!..."

"నీ వాలకం చూస్తుంటే మీవాళ్లపరువు ప్రతిష్ఠలు నడిబజారున కీడ్చేటట్లున్నావే !!" కోపంలోంచి ఆశ్చర్యంలోకి దిగుతూ అందామె.

"హుఁ! పరువు! ప్రతిష్ఠ!!.. .. మా పరువు, ప్రతిష్ఠలేవో నాకు బాగా తెల్సులెండి. వాటి నెలా నిల్పుకోవాలో కూడా తెల్సు. కాని బజారున కెక్కబోయేవి మీ పరువు, ప్రతిష్ఠలనిమాత్రం తెల్సుకోండి" ఆవేశంగా అన్నాను.

నా మాటలు మా నాన్నగారికి కోపాన్ని తెప్పించాయ్.

---

పై వారం ప్రారంభం

## గంగిరెద్దులు

పెద్ద కథ

---

"వెధవా! వేలెడంత లేవు ఏమిట్రా ఆ మాటలు? పెద్దంత్రం చిన్నంత్రం వుండక్కర్లా??" అన్నారు

"ఇంతదాకా వచ్చింతర్వాత కూడా అవెందుకు నాన్న? మర్యాదనేది ఇచ్చిపుచ్చుకోవడంలోనే నిలుస్తుంది డబ్బుండగానే సరిపోదు నోటిమంచితనం— పరిస్థితుల్ని క్షుణ్ణంగా అర్థంచేసుకోగల సామర్థ్యం—వివేకం మనిషన్నవారి కెంతైనా అవసరం అవి లేకుంటే మనిషి మనిషి కాదు(డు)"

అమ్మ, నాన్న నా మాటలకి ఆశ్చర్యపోయి చూస్తుండిపోయారు

సురేంద్ర తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయాడు

"దొంగవెధవ! దొంగవెధవ!! ఎంతెంత మాటలంటున్నాడు!? ఏవి చూసుకునో ఆ నోటి పెడసరం? ఎంత ధైర్యం! ఎంత ధైర్యం!!" విసవిసలాడిపోయింది సుందరమ్మ

నిజమే! సుందరమ్మగారన్నట్లు అంతంత పెద్దమాటలు నేనేనా అన్నాను?—అని నాకే ఆశ్చర్యం వేసింది

"హుం! దొంగవెధవ! నేనా? లేక మీ ముద్దుల కుమారుడా? ముందు నిర్ణయించుకోండి ఆ తర్వాత నోరు పారేసుకుందురు" అసహ్యం పుట్టిపడేలా అన్నాను

సుందరమ్మ అవాక్కై ప్రక్కనున్న సురేంద్రని కొన్నిక్షణాలు చూస్తుండిపోయింది

ఆమె ముఖంలో కొట్టొచ్చినట్లు అసహనం, అవమానం కోపం తాలూకు ఛాయలు కన్పించాయ్

సురేంద్ర తనకేవీ తెలియనట్లు దిక్కులు చూస్తుండేసరికి నా కెక్కడిలేని కోపమొచ్చింది

"జరిగింది ఇప్పటికైనా చెబుతావా? చెప్పవా?" అన్నట్లు సూటిగా సురేంద్ర కళ్లలోకి చూశాను.

అతని అధరాలు విచ్చుకున్నాయ్.

ముత్యాల్లా మాటలు వెలువడ్డాయ్

అవి నే నాశించినవి కావు

సురేంద్ర తన తల్లిని ఓదార్చడానికి పలికిన పలుకులవి నాలోని ఆరాటాన్ని— అసహనాన్ని — ఆవేదనని విస్మృతం చేసిన మాటలవి

ఓ ప్రక్క — సురేంద్రలా అన్నందుకు కోపంతో కూడిన ఆశ్చర్యం! మరో ప్రక్క— నా నిర్దోషిత్వాన్ని చాటుకోలేని అసహాయ స్థితి! సురేంద్ర అన్నమాటలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురు మంటున్నాయ్, వాటిని నే నెప్పుడూ మరచిపో(లే)ను— "అమ్మా! చేతి కందేట్లు, విలువైన వస్తువుల్ని పైన వుంచడం కేవలం మన బుద్ధి పొరపాటు, ఒకర్ననేంలాభం? తప్పంతా మనది పోతే పోయిందిలే!—వెధవది వాచీయేగా?— కాని మనుషుల విలువలు తెలిశాయ్!"

అలాంటి పరిస్థితిలో —

నేనేం చేయగలను?

నన్ను దొంగని చేశారు నేను నిర్దోషినని ఎలా చెప్పుకోను?

మా వాళ్లకి, సుందరమ్మగార్కి నేను నిర్దోషినని రుజువు చేసుకోవాలి! ఐతే అదెలా సాధ్యం?

ఏదైనా ఆధారం కావాలి! — ఎలాంటి ఆధారం కావాలి?

అందుకు నేనేం చేయాలి?

నేను దొంగని కానని నిరూపించుకునేదెలా?

జగం, సురేంద్ర లెందుకలా మారిపోయారు?

వారికి నేనేం అపకారం చేశాను?

'నీవు దొంగవి కావు! దొంగవి కావు!!' అని ఘోషిస్తున్న నా అంతరాత్మ ఘోష విన్పించుకునే వారే లేకపోయారు నేను దొంగని కానని నా అంతరాత్మకి తెలిసినా నాకు సంతృప్తి లేదు

నేను దొంగని కానని అందరికీ తెలియాలి తెలియజేయాలి అప్పుడే నాకు నిజమైన ఆనందం! సంతృప్తి!! సంతోషం!!! ఐతే ఎలా? ఎలా??

సురేంద్రకు తను చేసిన పని తప్పని తెల్సినా — నిజాన్ని ధైర్యంగా ఒప్పుకోడానికి అతని అహం, అభిమానం అడ్డుపడ్డాయ్.

అసలు తనింట్లో తనే దొంగతనం చేయాల్సిన ఖర్మేంపట్టింది తనకి?

జగంకి విషయం క్షుణ్ణంగా తెల్సినా ఎందుకు ఊరుకున్నాడు?

జరిగిన విషయంకి వాళ్లు పశ్చాత్తాప్పడ్లేదు క్షమనర్థించలేదు

చేయని నేరం నాపై పడినందుకు — నేరస్థునిగా పరిగణింపబడి నందుకు — శిక్షగా ఆ రోజు నేను తిండి తిప్పలు లేకుండా వీధి గుమ్మం ముందే కాలం గడిపినప్పుడు — "హమ్మయ్య! అసలే ఇంట్లో చెప్పకుండా వాచీ తీసుకెళ్లాం అంతటితో పోకుండా — వెధవది, దురదృష్టవశాత్తు పారేసుకున్నాం కూడా ఈ విషయం అమ్మతో ఎలా చెప్పటమా? — అని చాలా భయపడ్డాం కదూ? 'థేంక్‌గాడ్!' 'లక్కీ'గా ఆ నేరం— ఆ రాముగాడిమీద పడింది గనుక మనం బతికిపోయాం! " అని నన్ను చూసుకోకుండా సురేంద్ర, జగంతో అన్న మాటలు కేవలం నా ఒక్కడికే కాకుండా — అందరికీ విన్పించివుంటే— నా మీద పడిన ఈ అపవాదు మాసిపోనుకదా?—అని నాలోనేనే వాపోయాను

ఏమయితేనేం?—

కనీసం విషయం తెలియని అమ్మా, నాన్నల దృష్టిలో దోషిని! దొంగని!!

నా అంతరాత్మముందు నిర్దోషిని!

సురేంద్ర, జగంల అంతరాత్మలముందు నిర్దోషిని!

సురేంద్ర, జగంల తల్లి లో దోషిని! దొంగని!!

